# THE
# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES
## OFFICIAL REPORT

---

First day of the Sixth Session of the
Andhra Pradesh Legislative Assembly.

---

## THE ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Monday the 19th July, 1971.

The House met at Half-Past Eight of the Clock.

(Mr. Deputy Speaker in the Chair.)

Mr. Deputy Speaker :—Now the Leader of the House will move the condolence motion on the demise of Sri Marupilla Chitti, who is the sitting member of the Assembly.

## CONDOLENCE MOTION

re : Demise of Sri Marupilla Chitti, M.L.A.

The Chief Minister (Sri K. Brahmananda Reddi):—I move the following condolence motion :

"This House places on record its deep sense of sorrow at the demise of Sri Marupilla Chitti, a Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family"

Mr. Deputy Speaker : Mo ion moved.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి:—అధ్యక్షా, దాదాపుగా నాలుగు దశాబ్దాలపాటు విజయవాడ పట్టణంలోగాని, ఆ ప్రాంతంలోగాని బాగా ప్రకాశించినటువంటి ఒక తార రాలిపోయిందని మనవిచేస్తున్నాను. మరుపిల్ల చిట్టిగారు చిన్న వయసులోనే దేశనాయకులు, రాష్ట్రనాయకుల పిలుపు అందుకొని స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి అనేకసార్లు కారాగార శిక్ష అనుభవించిన సంగతి మీకందరికి తెలుసు. వారేకాదు, వారి భార్య శ్రీమతి భ్రమరాంబగారు కూడ జాతీయ ఉద్యమంలో పాల్గొన్నటువంటివారు. వారి కుటుంబమే దేశస్వాతంత్ర్యముకోసం జాతి అభ్యుదయానికి ఎంతో సేవచేసినటువంటి కుటుంబము. నాకు దాదాపుగా 32, 33 సంవత్స రాల స్నేహితం వారితో కద్దు. విజయవాడ ప్రాంతం—అందులో ముఖ్యంగా విజయవాడ పట్టణము వివిధ రాజకీయ పార్టీలకు ఒక కేంద్రము. అక్కడ ఎంత ఉద్రిక్త వాతావరణం ఉన్నప్పటికీ, అన్ని పార్టీలకు రాజకీయ ప్రాబల్యం హెచ్చు స్థాయిలో అప్పుడప్పుడు వడుస్తున్నప్పటికీ వారు యీ 40 సంవత్సరాలనుంచి ఎంతో ప్రజ్ఞతో, ఎంతో ధైర్యంతో ఎంతో సహనంతో ఓర్పుతో అశేషమైన ప్రజలయొక్క సహకారాన్ని, అభిమానాన్ని సంపా

దించుకొని ఆయన జెండాను ఎగరవేసినటువంటి పెద్ద అని మనవిచేస్తున్నాను. విద్యాధికుడు కాకపోయినా, మంచి చక్కని ఉపన్యాసం చెప్పే శక్తి పెద్ద లేకపోయి నప్పటికీ, కేవలం అతనియొక్క సేవ ద్వారా సామాన్య ప్రజలయొక్క బాగోగులు తెలుసుకోవటం వారికి సహాయపడటం ద్వారా అశేషమైన ప్రజలయొక్క సహకారాన్ని, అభిమానాన్ని విశ్వాసాన్ని సంపాదించినటువంటి నాయకులు వారు. వారు లేబర్ లీడర్‌గా వ్యవహరిస్తూ వచ్చినారు. ఎంత విషమ పరిస్థితి వచ్చినప్పటికీ—కాంగ్రెస్ తగాదాలే కాదు; ఇతర రాజకీయ పార్టీలతో తగాదాలే కాదు; ఎన్ని వచ్చినప్పటికీ బాగా గట్టిగా ఒక మూలస్థంభంలాగా నిలబడి చలనం లేకుండా ఉన్నటువంటి మహానాయకుడు శ్రీ మరుపిల్లచిట్టిగారు అని నేను మనవి చేస్తున్నాను. వారు 1955 లో శాసనసభకు ఎన్నికైనారు. మళ్లీ 65 లో ఎన్నికైనారు. కేవలం శాసనసభకు ఎన్నిక కావటమే ఆయన జీవితంలో పెద్ద విశేషమని—నేను మనవి చేయటం లేదు. ప్రజానాయకుడుగా ఉన్నటువంటి వారిని ఆ ప్రజలు అభిమానించి యీ శాసనసభకు తమ ప్రతినిధిగా పంపించటం సహజము. కాని వారు ఈ 40 సంవత్సరాలనుంచి కూడ పెద్దలతో—ప్రకాశం పంతులుగారు, పట్టాభిగారు, నాగేశ్వరరావు పంతులుగారు, కాశేశ్వరరావు పంతులుగారు, ఇతర పెద్దలదో సంపర్కం కలిగి వారి శిష్యులుగా అనుచరులుగా ఉంటూ, వారికిఎంతో సహాయకారిగా ఉంటూ, వారి అభిమానం సంపాదించుకొని ఎంతో కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టినటువంటి పెద్ద అని మనవి చేస్తున్నాను. ఇటీవల-ఒక నెలరోజుల క్రితం వారి ఇంటి సమీపంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేసినారు. ఆ ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం నాకు వచ్చింది. వారి వయసు 78 సం॥లు అయినప్పటికీ, వారి ఆరోగ్య పరిస్థితి అంత మామూలుగా ఉన్నదని చెప్పటానికి అవకాశం లేక పోయినా, యీ మరణం ఇంత తొందరగా సంభవిస్తుందని ఎవరూ ఊహించలేదు. నేను రాత్రి 10 గం॥లకు వరంగల్‌నుంచి ఇక్కడకు రాగానే నాకు యీ వార్త తెలిసింది. చాలా విచారం కలిగింది. ఒక విధంగా ఆలోచిస్తే—వారు నిండుజీవితం గడిపినారని అనుకోవలసి వస్తుంది. 78 సం॥లు ప్రజాజీవితంలో ఒక ప్రముఖమైన పాత్ర నిర్వహించి వారి విశ్వాసాన్ని సంపాదించుకొన్న వారు కాబట్టి పెద్దగా విచారపడవలసిన అవసరం లేదు కాని అటువంటి చక్కని మిత్రుడు, అక్కడ నాకు ఒక గట్టి మూలస్థంభంగా ఉన్నటువంటి పెద్ద రాలిపోవటం ముఖ్యంగా మన రాష్ట్రానికి, ఆ బెజవాడ పట్టణంలో ఉన్నటువంటి అనేక మంది స్నేహితులకు, మా పార్టీకి కూడ చాలా లోటని మనవిచేస్తున్నాను. రాజకీయంగా అభిప్రాయం భేదించినప్పటికీ బెజవాడ పట్టణంలో అనేకమంది—కమ్యూనిస్టులు కావచ్చును జనసంఘంవారు కావచ్చును. కాంగ్రెస్—ఓ—వారు కావచ్చును, ఇంకో పార్టీవారు కావచ్చును, ఏ పార్టీవారు అయినప్పటికీ—వారియందు వ్యక్తిగతమైన అభిమానం—వారి మోహము ఇతరులైనాసరే—ఆలకించే పరిస్థితి అక్కడ వారు తెచ్చుకొన్నారు. వారి మరణం పట్ల మనం, మన శాసనసభ సానుభూతి తెలియ పర్చవలసివుంది. వారి కుటుంబానికి మన శాసన సభయొక్క సానుభూతి తెలుపవలసినదిగా మీకు వినయ పూర్వకంగా మనవిచేస్తు

న్నాను. మన సమావేశాలు జరుగుతున్నప్పుడు ఒక సిట్టింగ్ మెంబర్ చనిపోయినారు కాబట్టి యీ శాసనసభ మనం యీ తీర్మానం పాస్ చేసుకోగానే వాయిదా వేయవలసినదిగా మీకు వినయపూర్వకంగా మనవి చేస్తున్నాను.

శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి:—అధ్యక్షా, మరుపిల్ల చిట్టిగారు గత రాత్రి తలవని తలంపుగా మనందరిని విడిచిపోవటం చాలా దురదృష్టకరమైన విషయము. ఒక ప్రజా మనిషి ప్రజలతో వేరు అయిపోయినారు. దాదాపు 15, 20 సం.ల నుంచి వారితో నాకు పరిచయం వున్నది. నాలుగైదుసార్లు వారి ఆతిథ్యాన్ని స్వీకరించటానికి అవకాశం కల్పించారు. వారు ప్రజలతో ఎంత సన్నిహితంగా ఉంటూ ఉన్నారో, ఎన్నోసార్లు నేను విజయవాడ పోయినపుడు చూడటం తటస్థించింది. అక్కడి పేద జనానికి హౌస్‌సైట్స్ ఇవ్వటానికి ప్రత్యేకంగా ఎన్నో సమావేశాలు ఏర్పాటుచేసి ప్రతి ఒక్కరిని పేరు పెట్టి పిల్చినపుడు వారికి ప్రజలందరితో ఎంత సన్నిహిత సంబంధం ఉన్నదో స్పష్టం అయినది. వారు 40 సం.లు ప్రజాజీవితంలో ఎంత నిస్వార్థంగా ఉండినారో తలచుకొన్నప్పుడు - వారి మరణానికి చాలా బాధకలుగుతున్నది. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు వారు హెచ్చుగా చదువుకొన్నవారు కాకపోయినప్పటికీ అతని యొక్క స్వభావాన్ని అర్థం చేసుకొన్నప్పుడు అతడు నిగర్వి అని అతనికి గర్వం ఏమాత్రం లేదని నేను చెప్పవలసి వున్నది. నేను ప్రజలచేత ఎన్నిక అవుతున్నానని తన పదవిని దుర్వినియోగం చేయడానికి ఎప్పటికీ తన ప్రజాజీవితంలో ప్రయత్నం చేయలేదు. నిష్కళంకంగా ప్రజాసేవ చేయాలి. ప్రజల యొక్క కష్టసుఖాలలో భాగస్వాములు కావాలి అని ప్రయత్నంచేసి వచ్చినాడు కనుకనే ప్రజలందరు రాత్రి అతని మరణవార్త విన్న తరువాతనే తండోపతండాలుగా వచ్చి వారి యొక్క భౌతికదేహాన్ని చూడడానికి ప్రయత్నం చేశారు. ఇవ్వాళ విజయవాడలో వారి దహనక్రియలు చేసే సందర్భంలో బహుశః విజయవాడ కదలివస్తుందని ఊహించడానికి కూడ అవకాశం యున్నది. ఈ విధంగా ప్రజాజీవితంలో ప్రజలతో నేరుగా సంబంధం పెట్టుకొని వారి కష్టసుఖాలలో భాగస్వాములుగా ఉంటే ప్రజలు ఎప్పటికి ఆ ప్రజా నాయకులను మరచిపోరనే విషయం ప్రజాజీవితంలో ఉండేవాళ్ళం మనమందరము అర్థం చేసుకోవలసిన అవసరం యున్నది. రాజకీయంలో నిస్వార్థసేవ అనేది తప్పకుండా ప్రజానాయకులకు వారి జీవితాంతం తరువాత కూడ అది ప్రతిబింబితం అవుతూనే ఉంటుందని, అది నిరూపణ చేసుకోడానికి ప్రతి ఒక్కరు రాజకీయాలలో ఉండేవారు ప్రయత్నం చేయవలసిన అవసరం ఉంటుంది. తాము ఉండే పార్టీకి నేరుగా సంబంధం ఉండి పార్టీని బలపరచడానికి ప్రయత్నం చేయడమే కాదు. లేబర్ ఫీల్డు విషయంలో కూడ ఆయన ఎప్పుడూ ప్రయత్నంచేస్తూ వచ్చినాడు. విజయవాడలో ఏ మంచి కార్యక్రమం సంభవించినప్పటికీ, ఏ మీటింగ్‌లు జరిగినప్పటికి - చిట్టిగారికి తెలియనిది ఏ మీటింగ్‌గాని, ఏ బ్రహ్మాండమైన సమావేశాలు గాని జరగలేదు అని చెపితే అతిశయోక్తి కాదు. కాశేశ్వరరావు పంతులుగారి తరువాత విజయవాడ పితామహుడు అని చెపితే కూడ అతిశయోక్తిలేదు అని మనవి

చేస్తున్నాను. వారే కాదు, వారి సతీమణి కూడ యిరువురు స్వతంత్ర సమర పోరాటంలో భాగస్వాములై ఎంతో త్యాగంచేసి కష్టనష్టాలకు ఓర్చి జైళ్ళకు పోయిన సమాచారం కూడ వున్నది. హెచ్చుగా వయస్సు ఉన్నప్పటికి వారు మనలను విడిచిపోవడం చాల దురదృష్ట కరమైన విషయం. ఈ హౌస్‌కు వారు లేనిలోటు ఎప్పుడూ కనిపిస్తూనే వుంటుంది. ప్రత్యేకంగా విజయవాడ పట్టణం వారిని ఎప్పటికి మరచిపోదని నేను మనవిచేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుభూతి తీర్మానంతో సంపూర్తిగా ఏకీభవిస్తూ నా తరపునుంచి మా పార్టీ తరపునుంచి వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని కోరుతూ నేను ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ వై. వెంకటరావు:—అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుభూతి తీర్మానాన్ని నేను, మా పార్టీ తరపున కూడ బలపరుస్తున్నాను. చిట్టిగారితో నాకు సన్ని హిత సంబంధంలేదు గాని మాకు దగ్గరవారు. వారు స్వతంత్ర సమరయోధులు. చాలా ప్రముఖపాత్ర వహించారు. వారు నిగర్వి. త్యాగశీలి. వారు పూర్వంనుంచి బాపూజీ నాయ కత్వాన ఏ ఉద్యమంలో కూడ పాల్గొనకుండా వుండలేదు. సంప్రదాయం కలిగిన మనిషి. అన్నిటికన్న ముఖ్యంగా వారు మామూలుగా బజారులో నడిచి వెడుతూ 10 మంది బీద ప్రజానీకం అభిమానాన్ని చూరగొంటూ వారి పనులుచేస్తూ ఆ ప్రజాసేవ, ఆ కార్యక్రమా లలో ఎక్కువ నిమగ్నులై వారు ఆ విధంగా జీవించారు. అందరికి అందుబాటులో ఉండే మనిషి. ఏ రాజకీయ పార్టీ వెళ్ళినా, ఎవరు పోయి అడిగినా వారి పనులు, చిన్నచిన్న కార్యక్రమాలు తీసుకొని అన్నివిధాల వారికి సహాయపడుతూ తోడ్పడుతున్న వ్యక్తి. జాతస్యమరణం ధృవం — అని చనిపోవడం తప్పదు. వారు వయోవృద్ధులు. ముఖ్య మంత్రిగారు శెలవిచ్చినట్లు నిండువయస్సు వచ్చినది. కాని వారు లేనిలోటు భర్తీచేయడం చాల కష్టం అని నేను అనుకుంటున్నాను. ఈ సందర్భంలో వారి కుటుంబానికి నా తరపున మా పార్టి తరపున కూడ సానుభూతి తెలియజేస్తూ ఈ అవకాశం యిచ్చిన మీకు నా ధన్య వాదములు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

డాక్టర్ టి. వి. ఎస్. చలపతిరావు :—అధ్యక్షా, సభానాయకులు బ్రహ్మానందరెడ్డి గారు, ప్రతిపక్షనాయకులు రామచంద్రారెడ్డిగారు, వెంకటరావుగారు చెప్పిన ప్రతివిషయంతో ఏకీభవిస్తూ నేను ప్రత్యేకంగా రెండు మూడు విషయములు మనవి చేయదలచుకొన్నాను. చిట్టిగారి మరణం ఈ సభవారందరికి దేశ ప్రజలకు ఎంత దుఃఖం విచారం కలిగించిందో అంతకంటె, నాకు ప్రత్యేకంగా వ్యక్తిగతంగా ఎక్కువగా కలిగిందని చెపుతున్నాను. దాదాపు 30, 32 ఏండ్ల క్రిందట రాజకీయ జీవితం ప్రారంభం కావడానికి ప్రధానకారకులు కీ. శే. కాశీశ్వరరావుగారు, సర్దార్ మరుపిళ్ళ చిట్టిగారని సగర్వంగా మనవిచేస్తున్నాను. ఆయన సుప్రసిద్ధ దేశభక్తులు. వారు చెప్పినట్లు విద్యావంతులు కాదు. వారి జీవితంలో 50 సంవత్సరాలు రాజకీయాలతో పెనవేసుకొని పోయినది. 1922 లో చారిత్రాత్మకమైన

అఖిలభారత కాంగ్రెస్ బెజవాడ పట్టణంలో జరిగినప్పుడు చిట్టిగారు కాశేశ్వరరావుగారి నాయకత్వాన సామాన్యమైన వాలంటీర్‌గా వున్నారు. ఈనాడు సుప్రసిద్ధ దేశభక్తులుగా, రాజకీయవాదులుగా, ప్రజానాయకులుగా, జాతీయ కార్మిక నాయకుడుగా ఎంత పేరు ప్రతిష్టలు సంపాదించారో ఆ నాడు పెద్ద రౌడీగా పేరు ప్రతిష్టలు సంపాదించారు. 74 ఏండ్లు అంటే 50 సంవత్సరాలు రాజకీయ జీవితం పోతే 24 సంవత్సరాల వరకు ఆయన పెద్ద రౌడీ. ఆయన పేరు చెపితే విజయవాడ పట్టణమే కాదు. పరిసర ప్రాంతం అంతాకూడ గజగజలాడి పోయేది. అలాంటి వారు. గాంధిమహాత్ముని నాయకత్వ ప్రభావం దేశంలో అట్టడుగున ఉన్నటువంటి ప్రజలు ఎవరిమీద పడింది అంటే—ఆంధ్ర ప్రదేశానికి సంబంధించినంత వరకు సర్దార్ మరుపిళ్ళ చిట్టిగారు అని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. వలంటీర్‌గా ప్రారంభంచేసి జీవితాన్ని, ఆ నాటినుంచి తనకు ఉన్నటువంటి మామూలు వ్యక్తిగత జీవితాన్ని అంతటిని వదలివేశారు. అది ఎంత గొప్పత్యాగం? మన పెద్దలు యింద్రియ నిగ్రహమని చెపుతూ ఉంటారు. ఆ నాడు ఆ వయస్సులో, ఆ పరిస్థితులలో ఆయన అంత యింద్రియ నిగ్రహం సంపాదించి ఆ నాటి జీవిత విధానం అంతా మార్పు చేసుకొన్నారు. హింసాకాండకు పూర్తిగా స్వస్తి చెప్పారు దౌర్జన్యం అనేదానికి ఆయన పెట్టినది పేరు. దౌర్జన్యకాండకు స్వస్తి చెప్పారు. అప్పటికి ఉన్నటువంటి అలవాట్లు అన్ని మానివేశారు. ఆనాటి నుంచి ఖద్దర్ ధరించడం మొదలు పెట్టారు. ఆయన చేయడమే కాకుండా, ఆయన కుటుంబ సభ్యులందరిచేత కూడ చేయించారు. ఆ ప్రాంతంలో క్రొత్త పేట కార్మికులు ఉండే ప్రాంతం అంతా ఈనాడు సుప్రసిద్ధ దేశభక్తులు, జాతీయవాదులు ఉన్న పేటగా మారిపోయిందంటే ఆ ఘనత అంతా సర్దార్ చిట్టిగారిది అని చెప్పడం అతిశయోక్తి కాదు. తనతోటి యువకులను, తన తరం వారిని, తన తరువాత తరం వారిని కూడ కాంగ్రెస్ యోధులుగా చేశారు. విజయవాడ పట్టణంలో కాంగ్రెస్ ఉద్యమం ఎవరిది అంటే—కాశేశ్వరరావుగారు ఒక యింటిలిజెంట్ జైంట్. నాయకుడుగా ఉన్నప్పటికి ఆయనకు కమాన్‌డర్ యిన్ చీఫ్ సర్దార్ మరుపిళ్ళ చిట్టి. అలాంటి చరిత్ర సృష్టించారు. ఆనాడు పట్టాభి సీతారామయ్యగారు కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఉన్న కాలంనుంచి, ప్రకాశంగారు కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఉన్న కాలంనుంచి ఆయన వర్కింగ్ కమిటీ సభ్యుడుగా లేనటువంటి కాలం లేదు. నాకు బాగా గుర్తు ఉన్నది. మన మొదటి ముఖ్యమంత్రి అయిన నీలం సంజీవరెడ్డిగారు, నేటి ముఖ్యమంత్రి అయిన బ్రహ్మానందరెడ్డిగారు కూడ విజయవాడ పట్టణం వచ్చినప్పుడు, ఆయన శిలావిగ్రహ ప్రతిష్టకుగాని మరొక సమయంలో గాని మా నాయకులు సర్దార్ మరుపిళ్ళ చిట్టిగారని సంబోధించిన ఘట్టాలు ఎవరూ మరచిపోలేరు. మహానాయకులు. ఆయనకు రెండు విషయాలలో ప్రత్యేకత యున్నది 1. 42 ఉద్యమంలో ఆయన భార్య భ్రమరాంబగారు కూడ జైలుకు వెళ్ళారు. ఆవిడ గర్భిణీస్త్రీగా జైలుకు వెళ్ళారు. జై దేవ్ అనే కుమారుడు వెల్లూరు జైలులో పుట్టారు. ఆయన ఈనాడు ఏదో సినిమా పరిశ్రమలో కృషి చేస్తున్నట్లున్నారు. అవిశ్రాంతంగా యావత్ కుటుంబాన్ని దేశ కళ్యాణంకోసం,

స్వతంత్రపోరాటం కోసం అంకితం చేసినటువంటి కొద్ది కుటుంబాలలో మరుపిళ్ళ చిట్టిగారిది ఒకటి అని మనం చెప్పుకోవాలి. రెండవ విషయం—ఆయనలో వున్న ప్రత్యేకత—అగ్ర కులాలయిన బ్రాహ్మణ కులాలలోగాని, యితర కులాలలోగాని లేనటువంటిది—ఒక ప్రతిభ ఆయనలోవున్నది. ఈ రోజు వరకూ ఆయన కుటుంబం అంతా ఏక కుటుంబం. జాయింట్ హిందూఫామిలీ అనేటటువంటిది ఎక్కడయినా వున్నదంటే, మా విజయవాడ పట్టణంలో గాని, ఇతర ప్రాంతాలలోగాని —ఏ కులంలోనూ లేనిది—చిట్టిగారు యీ రోజువరకూ, వారి తండ్రి తాతలనాడు సృష్టించినది. జాయింట్ ఫామిలీ యీ రోజువరకూ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. ఆయన కుటుంబానికి రోజువారీ రేషన్ చూస్తే—అరబస్తా బియ్యం వుంటే గాని వారికుటుంబ సభ్యులు అందరికీ భుక్తికి సరిపోదు. ఎందుకంటే—అన్న కుమార్లు, తమ్ముడు కుమార్లు, మనుమలు, మనుమరాళ్ళు, యీ రోజువరకూ జాయింట్ ఫామిలీ మెయిన్ టెయిన్ చేస్తూ వచ్చారాయన. అది మాత్రం చాలా గొప్పగా చెప్పుకోవలసిన విషయం చాలా గుట్టు, చాలా ఐక్యత, అన్యోన్య ప్రేమను వున్నటువంటివారు. ఎవరి వివాహం వచ్చినా, తమ స్వంత బిడ్డల వివాహంలాగా జరిపించినటువంటి మహా ఉదారమైన చరిత్రగలిగిన సర్దార్ మరుపిళ్ల చిట్టిగారు రాత్రి పోయినారని ఇంటివద్దనుండి టెలిఫోన్ రాంగానే మొట్టమొదట నేను నమ్మలేదు. ఎందువల్లనంటే, గత మే నెలలో రాత్రిపన్నెండు గంటలప్పుడు నాకు యిలాగే టెలిఫోన్ వచ్చింది. చిట్టిగారు అకస్మాత్తుగా యిప్పుడే పోయినారు' అని, ఫోను వస్తే నేను నిజమేననుకొని గబగబా వారియింటివద్దకు పరుగెత్తుకు వెళ్ళాను ప్రశాంతంగా వుంది. అక్కడి వాతావరణం. ఆయన నిద్రపోతున్నారు అన్నారు ఇంటి ముందు ఎవరో కుర్రవాళ్ళుంటే, ఏమయ్యా, చిట్టిగారికి ఎట్లావుంది అని అడిగితే, ఇప్పుడే వచ్చారండి, ఆయన హాయిగా నిద్రపోతున్నారన్నారు. ఇది ఎవరో నీచుడు చేసిన పని అనుకుని ఇంటికి వచ్చి, ఏ డాక్టర్ అయితే ఆయనను ట్రీట్ చేస్తున్నారని, ఆయన చేతుల్లోనే పోయినారని చెప్పారో ఆ డాక్టర్‌గారినికూడా వెంటనే కాంటాక్ట్‌చేసి కనుక్కుంటే నన్ను అసలు ఎవరూ పిలవలేదు. పట్టిదే అంతా, అన్నారాయన. అందుచేత, రాత్రికూడా, యిలాగే ఎవరయినా నీచుడు తిరిగి యీవిధంగా చేస్తున్నాడేమో నని అభిప్రాయపడి, తరువాత వెంటనే టెలిఫోన్‌చేసి కనుక్కుంటే, పోయినమాట నిజమేనని, నిన్న 12 గంటలకు గుంటూరు హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారని, ఆపరేషన్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఆయన కన్నుమూయడం జరిగినదని తెలిసినది. ఆయన సుప్రసిద్ధ దేశభక్తుడు. విద్యావంతుడు కాకపోవచ్చు, అతనికి వున్న పొలిటికల్ కెపాసిటీ-క్షమించాలి నేను యీ మాట చెబుతున్నందుకు, మంత్రులుగా వున్న, మహానాయకులైన వారికి కూడా ఆ కెపాసిటీలేదని నేను చెప్పడం, వ్యక్తిగతంగా ఆయనపై నాకున్న అభిమానమే కాదు, యాభయ్యేళ్ళ ఆయన చరిత్రలో ముప్పయ్యేళ్ళుగా ఆయనకు, నాకు సన్నిహిత సంబంధం వున్నది. కాబట్టి, తమ అనుమతితో కొన్ని విషయాలు యిట్లా చెప్పడం జరిగింది. ఈనాటి దేశ క్లిష్టపరిస్థితులలో యిలాంటి అనుభవశాలి అయిన, ప్రజా హృదయాన్ని చూరగొన్నటువంటి

గొప్ప ఆర్గనైజర్ లేకపోవడం గొప్ప లోటు. పట్టాభి సీతారామయ్యగారు చిట్టిగారంటే - ఆ రోజులలో, యింకా స్వాతంత్ర్యం రాలేదు. ఇప్పుడు లేబర్ మినిస్ట్రీస్‌ను పెడుతున్నారు. ఆనాడు ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీకి లేబర్ పోర్టుఫోలియో ఎవరు చూడాలయ్యా అంటే, అది సర్దార్ చిట్టిగారిది. ప్రత్యేకనిధులు యిచ్చి, - యీనాడు కార్మికులను ఆర్గనైజ్ చేయడానికి కమ్యూనిస్టుపార్టీ ఉద్భవించిందిగాని, చిట్టిగారు కార్మికులను ఆర్గనైజ్ చేసి, సంఘటితపరచి, వారందరినీ దేశభక్తులనుచేసి, నిత్యఖద్దరుధారులనుచేసి, వారందరినీ, 1930 ఉద్యమంలోగాని, '40 ఉద్యమంలోగాని, '42 ఉద్యమంలోగాని అన్ని ఉద్యమాలలోనూ ఆ పేటనుంచి ఎంతోమంది యువకులను జైలుకు పంపించారూ అంటే కమ్యూనిస్టుపార్టీకి కూడా ఆయన మార్గదర్శకులుగా వున్నారన్నమాట. ఈ విషయం నేను వ్యక్తిగతమైన అభిమానంతో చెబుతున్నానని అనుకున్నప్పటికి, చరిత్ర ప్రసిద్ధమైన నిజం చెప్పాలంటే ఇది చెప్పవలసిన విధివున్నదని మనవిజేస్తున్నాను. వారి మరణం మాత్రం కాంగ్రెసుపార్టీకి, బెజవాడ పట్టణానికి, కృష్ణాజిల్లాకు తీరనిలోటు. ఎందుకంటే - వారి వయస్సు పెద్దది అయినప్పటికి, యిందాక నేను చెప్పినట్లుగా, పొలిటికల్ సెగాసిటీ, వారికున్న అనుభవం, ప్రతివారు వారివద్దకువెళ్ళి సలహాలు తీసుకోవడం, సంప్రదించడం జరుగుతూ వుండేది, ముప్ఫయేళ్ళ సుదీర్ఘమైన చరిత్రలో రాజకీయమైన అభిప్రాయభేదాలు రాలేదని నేను మనవిజేయడంలేదు. అయినప్పటికిన్నీ, వ్యక్తిగతంగా నన్ను ఒక కుటుంబ సభ్యుడిగా వారు తీసుకునే అదృష్టం నాకు కలిగిందని మనవిజేస్తున్నాను. నాకు వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతున్నాను - ముఖ్యమంత్రి గారు సభను వాయిదావేస్తున్నారు - ఇంకా చాలామంది కూడా వారి ఫ్యూనెరల్‌కు ఎటెండ్ కావాలనే ఆతృతతో వున్నారని, నేను కూడా పెడుతున్నానని మనవిజేస్తున్నాను. వారి మరణం మాత్రం తీరని లోటుకలిగించింది ఆంధ్రరాజకీయాలలో. ఇటీవలనే ముఖ్యమంత్రి గారు కూడా చెప్పారు-నాకున్నూ, చిట్టిగారికీ ఎప్పటికీ ముసలితనం రాదని; మళ్ళీ '72లో తిరిగి యీవైపునుంచే పోటీ చేస్తారని ఆయన చెప్పినట్లుగా నేను విన్నాను. నిజంగా కాంగ్రెసుపార్టీకి యిది పెద్దలోటు, ఆయన ఆ ప్రాంతంలో కాంగ్రెసుపార్టీకి కంచుకోట. విద్యావంతుడు కాకపోవచ్చు; చాలా గొప్ప ఆర్గనైజర్; సుప్రసిద్ధ దేశభక్తుడు. ఒక విషయం మనవిజేసి నేను సెలవు తీసుకుంటాను. '46లో మనకు స్వరాజ్యం వచ్చేముందు, పార్లమెంటరీ కమిషన్ వచ్చి ఎలక్షన్స్ జరపాలనే విషయంలో ప్రజాభిప్రాయం ఎలా వుందోననే డివిజన్ తీసుకుంటే-అప్పుడు జస్టిస్‌పార్టీ యింకా చాలా బలంగా వున్నది- ఆయన దురదృష్టవశాత్తూ, నిత్యం యీ జైలు కార్యక్రమాలలో వుండి, మంచి ఆస్థిగలవాడైనప్పటికి, ఆస్థి అంతా త్యాగంచేసి పోగొట్టుకున్నాడు; దీనిని కనిపెట్టి, ఒక గొప్ప జస్టిస్ పార్టీ నాయకుడు-'36లో అనుకుంటాను-'నువ్వు కాశీశ్వరరావుకు వర్క్ చెయ్యి చిట్టీ, నీకు వున్న ఆర్థికబాధలన్నీ తొలగిస్తాం; నీకున్న తాకట్టు అంతా ఇచ్చేస్తాము. నువ్వు యీ విధంగా చెయ్యి' అని అంటే, వెంటనే ఆయనకు పాత రౌడీ రోజులు జ్ఞాపకం వచ్చి,

మెడబట్టుకుని గెంటి, పో, వెళ్ళిపో, అమ్ముడుపోయేవాడిననుకున్నావా? అని చెప్పినటువంటి క్యారెక్టర్ గలిగినటువంటి మహానాయకులలో ఆయనొకరు. వారి మరణానికి నా వ్యక్తిగతమైన దుఃఖాన్ని తెలియజెయ్యడమేగాక, ఇతర నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలతో కూడా ఏకీభవిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ, నాకీ అవకాశం ఇచ్చినందుకు తమకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యస్. వేమయ్య:— అధ్యక్షా, సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంతోను, వారు వెలిబుచ్చిన అభిప్రాయాలతోను, రామచంద్రారెడ్డిగారు, డాక్టర్ చలపతిరావుగారు వెలిబుచ్చిన అభిప్రాయాలతోను నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను చిట్టిగారు మనందరితో మెలిగిన మిత్రుడు. ఆయనతో నాకు గత 20 సంవత్సరాలబట్టి పరిచయం వున్నది. చాలా మృదువుగాను, నెమ్మదిగాను కనబడే మనిషి. ఆ నెమ్మదితనంలోనే పటుత్వంకలిగిన మనిషి అనికూడా అందరికీ తెలుసు. చిట్టిగారు పోవడంవలన, వారి కుటుంబానికి, పట్టణానికేగాక యితర ప్రజలకుకూడా నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నాను. వారిని గురించి పునశ్చరణ చేయడమంటే—చాలా దీర్ఘకాలంగా వారు ప్రజాపోరాటాలలో, ముఖ్యంగా జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో వారు భాగస్వాములు కావడం మనయందరికి తెలుసు. వారి మరణంవలన ఏర్పడే లోటుగూర్చి ముఖ్యమంత్రిగారు, యితర మిత్రులు వెలుబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, వారి కుటుంబానికి నా తరపున, మా పార్టీతరపున గాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ, వారికి మరొకసారి జోహార్లు అర్పిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆర్. సత్యనారాయణరాజు :— అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుభూతి తీర్మానాన్ని మా పార్టీతరపున పూర్తిగా బలపరుస్తున్నాను. 74 సంవత్సరాల వయస్సుగలిగిన చిట్టిగారు, దాదాపు యాభై సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో వుంటూ, ముఖ్యంగా భార్యాసమేతంగా, కుటుంబసమేతంగా, జాతీయోద్యమంలో పాల్గొన్నటువంటి పాత్ర వారికి వున్నదనేది స్పష్టంగా కనబడుతున్నది. వారి ఆశయాలు, సిద్ధాంతాలు ఏమయినప్పటికీ, తాను నమ్మిన సిద్ధాంతంకొరకు, ఆశయంకొరకు కృషి చేయడమేగాక, శారీరకంగాను, మానసికంగాను సర్వం త్యాగం చేసిన మహాపురుషులలో ఆయన ఒకడు. విజయవాడ పట్టణం పేరు చెప్పినప్పుడు రాజకీయాలలోవున్నవారికి వెంటనే ఆయన పేరు గుర్తు వస్తుంది. ఆయన మరణం విజయవాడ పట్టణానికి ముఖ్యంగా తీరని లోటు అని భావించవలసి వుంటుంది. సభ్యుడుగా, శాసనసభా రంగములోకూడ ఆయన కృషి వున్నది. ఆయన అందరితోను అంత చనువుగా లేకపోయినప్పటికీ, మితభాషిగా వున్నప్పటికీ, ఆయనలో నిరాడంబరత్వం కొట్టవచ్చినట్లు కనిపించేది. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన విషయాలతో ఏకీభవిస్తూ నాతరపున, మా పార్టీ తరపున కూడా వారికి ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ ఎ. మాధవరావు:—అధ్యక్షా, రాజకీయరంగంలోని ఒడుదుడుకులలో 70 సంవత్సరాలకాలం రాజకీయ జీవితం నడపడమే చాలా ఖ్యాతి. అటువంటి రాజకీయవేత్త యీనాడు శాసనసభలో వుండి, శాసనసభ జరిగేటప్పుడు ఆంధ్రరాష్ట్ర ప్రజలను వదిలి పోవడం చాలా విచారకరమైన విషయం. మా పార్టీ తరపున, నా తరపున, సభానాయకులు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారి ఆత్మకు శాంతి కలుగుగాక అని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

श्री बदरी विशाल पित्ती : अध्यक्ष महोदय । मैं अपनी ओर से और सयुक्त संमाजवादी दल की ओर से श्री चिट्टी की मृत्यु आत्मा को श्रद्धानजली अर्पित करता हूँ।

శ్రీమతి జె. ఈశ్వరీబాయి:—చిట్టిగారి మరణం మన స్టేటుకూ, ప్రజలకూకూడా తీరని లోటు. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను మా పార్టీనుండి బలపరుస్తూ, చిట్టిగారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ, చిట్టిగారియందు గౌరవసూచకంగా యీ సభను యీనాటికి వాయిదావేస్తే బాగుంటుందని భావిస్తున్నాను.

శ్రీ కె. రామనాథం:—అధ్యక్షా, సభానాయకులు ప్రవేశపెట్టిన యీ సంతాప తీర్మానంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. సర్దార్ చిట్టిగారు నిజంగా సర్దారేనని చెప్పాలి. మనిషి ఎంత సౌమ్యంగా కనిపించినప్పటికీ అవసరమైనప్పుడు ధృఢమైన నిర్ణయాలు తీసుకునే శక్తిగలవారు, వారు. వెనుకబడిన వర్గాలకు, కార్మికులకు వారు నిజమైన ప్రతినిధిగావుండేవారు. వారి స్థితిగతులను బాగుచేయడానికి వారందరినీ సంఘటితపరచడంలో ఆయనచేసిన కృషి, పడిన శ్రమకూడా ఎవ్వరూ మరువరానటువంటిది. ఎవరితో పరిచయం కలిగినప్పటికీ వారందరినీ ఆకర్షించగల వ్యక్తి వారు. వారు లేకపోవడం యీనాడు మన రాష్ట్రానికి ప్రత్యేకంగా కృష్ణాజిల్లాకు తీరని లోటని చెప్పక తప్పదు. వారుంటే రాబోయే ఎన్నికలలో మావంటివారందరినీ సంఘటితపరచడానికి ఎంతో ఉపయోగపడేవారు. పార్టీకి, ప్రజలకూకూడా వారి మరణం తీరని లోటని చెప్పక తప్పదు. ఈ తరుణంలో వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నాను.

డా. టి. ఎస్. మూర్తి :— అధ్యక్షా, మరుపిళ్ళ చిట్టిగారి ఆకస్మిక మరణానికి విచారపడనివారెవ్వరూ వుండరు. ఆయన ప్రముఖ కార్మిక నాయకుడు. స్వాతంత్ర్య యోధుడు, శుద్ధ కాంగ్రెసువాది. మరుపిళ్ళ చిట్టిగారంటేనే విజయవాడ, విజయవాడ అంటేనే మరుపిళ్ళ చిట్టి అనే పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నవారి మరణం పట్ల నా తరపున, నా గ్రూపు తరఫున సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలుగుగాక అని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య:—అధ్యక్షా, రాజకీయ జీవితంలో చిట్టిగారికి నాకూ చాలా సంవత్సరాలనుంచి స్నేహం వున్నది. వారు కార్మికవర్గ ప్రతినిధిగా వుండి ఒకసారి అసెంబ్లీకి నిలబడి; ఆ తరువాత జనరలు సీటులో ఎలక్టు కావడం జరిగింది. విజయవాడ పట్టణంలో దృఢమైన ప్రజా ఉద్యమం, కాంగ్రెసు ఉద్యమం నడిపినవారు వారు. చలపతి రావుగారు చెప్పినట్లు ఆయన మొట్టమొదటి జీవితానికీ, గాంధీజీ జాతీయ వుద్యమం వచ్చిన తరువాత ఆయన జీవితానికి తేడా చూచుకుంటే జాతీయ వుద్యమ ప్రభావం వారిమీద ఎంత పడిందో తెలుస్తుంది. వారు చనిపోవడం మనకు తీరని లోటు. వారి కుటుంబానికి సానుభూతి ప్రకటిస్తూ, వారికి నా జోహార్లు అర్పిస్తున్నాను.

శ్రీ టి. వి రాఘవులు:—అధ్యక్షా, ఈనాడు చాలా దుర్దినం. మన సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానంతో నేను ఏకీభవిస్తూ, సుప్రసిద్ధ దేశభక్తులైన సర్దార్ చిట్టిగారు కన్ను మూసినందుకు నేను విచారిస్తున్నాను. వారు సామాన్యమైన ప్రజానీకానికి అపారమైన సేవచేశారు వారు లంబాడీపేట, కొత్తపేట, వించ్‌పేట, ముస్లిమ్ లోకాలిటీలకూ, హరిజనులకు చేసిన సేవ నిరాడంబరమైనది, నిరుపమానమైనది అని చెప్పడంలో ఏవిధమైన అతిశయోక్తి కూడా లేదు. సర్దార్ అనేది వారికి సార్థకనామమని చెప్పవచ్చు. వారి చూపులోనూ, చేసే పనులలోనూ హుందాతనం వుండేది. ఎంతమందికి ఉపకారం చేద్దామా అనే తత్వం తప్ప మరొకవిధమైన ఆకాంక్ష వారిలో లేదు. వారి గృహం పేదలకు పెన్నిధిగా వుండేది. అది వారి సేవాపరాయణత్వానికి నిదర్శనం. వారు చాలా గొప్ప త్యాగులు. రాష్ట్ర నాయకత్వంలో ఒక పెద్ద వెలితి ఏర్పడిందా అన్నంతగా మనం చెప్పుకోవాలి. నిరాడంబరులైన సేవాతత్పరులు అరుదుగా వుండే ఈ సమయంలో వారు మనకు లేకుండా పోవడం తీరని లోటుగా నేను భావిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారి కుటుంబానికి నా సానుభూతికూడా తెలియజేస్తూ, నాకు యీ అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలర్పిస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. వెంకటనారాయణ:—అధ్యక్షా, ఈనాడు చాలా దుర్దినం. ఒక ప్రఖ్యాత దేశభక్తుడు. ఆంధ్రదేశంలోనే పేరెన్నికగన్న కాంగ్రెసు నాయకుడు. కార్మిక నాయకుడు అయిన శ్రీ మరుపిళ్ళ చిట్టిగారు దివంగతులైనారు. ఇది చాలా విచారకరమైన విషయం. ఆయన నాయకులలో నాయకుడు, వర్కర్సులో వర్కరు. ఆయనకూ, నాకూ సన్నిహిత సంబంధం జాతీయోద్యమంలోనే జరిగింది. జైలుజీవితంలోకూడా మేము కలిసివున్నాము.వారు ఆప్యాయంగా పలకరించే మనిషి. జాతీయోద్యమం నడిపిన రోజులలోనుంచి చిట్టిగారే విజయవాడ, విజయవాడే మరుపిళ్ళ చిట్టిగారు అనే పర్యాయపదాలున్నాయి. సభానాయకులు చెప్పినట్లు అన్ని ఉద్యమాలకూ విజయవాడ పట్టణం మహాకేంద్రం. ఆ కేంద్రంలో ఏమి వచ్చినా మహాప్రళయంగానే వస్తుంది. అటువంటి ప్రళయాలన్నిటిలోనూ అంతర్గతంగానూ, బహిర్గతంగా కూడా ఆయన నాయకత్వం వహించుతూ, సమస్యలను పరిష్కారం చేయ

డంలో దిట్టంగా వ్యవహరించిన కార్యశూరుడు, కార్యదక్షుడు ఆయన. ముఖ్యంగా కార్మిక రంగంలో ఆయన పేరు చెబితేనే విజయవాడ పట్టణమంతా ఉప్పొంగిపోయేది. ఆయన, కార్మికనాయకుడుగా వుండేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే నాన్‌వయలెంట్ డిక్టేటర్‌గా వుండేవారు. ఆయన ఏది చెబితే అది శాసనంగా చెల్లుబడి అయిన రోజులున్నాయి. వారి ఆత్మకు శాంతి నొసంగాలని భగవంతుని ప్రార్థిస్తూ, గాఢ విషాద సముద్రంలోవున్న వారి భార్యా పిల్లలకు నా సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ ఎం. ఆర్. అప్పారావు :— అధ్యక్షా, మరుపిళ్ళ చిట్టిగారితో నాకు 1950 వ సంవత్సరంనుంచే సన్నిహిత సంబంధం వున్నది. ఆయన మనరాష్ట్రానికి అంత కంటే మా కృష్ణా జిల్లాకు ముఖ్యులుగా వుండేవారు, వారూ, కాశేశ్వరరావుగారూ కలిపి జిల్లాను, రాష్ట్రాన్ని నడిపించిన రోజులు మనందరికీ తెలిసినవే. వారంటే నాకు చాలా గౌరవం, వారుకూడా నేనంటే చాలా ప్రేమతో చూస్తుండేవారు. రాజకీయరంగంలో 45 సంవత్స రాల నుంచీ అనేక పరిణామాలు వచ్చాయి. మాజిల్లాలోనూ, రాష్ట్రంలో వచ్చిన పరిణామా లలోనూ నేను తరచు వారి సలహా తీసుకుంటూ వుండేవాడను. అదృష్టవశాత్తు రాజకీయ విషయాలలోనూ, యితర విషయాలలోనూ కూడా మేమిద్దరం ఒకే మార్గం త్రొక్కడం సంభవిస్తూ వుండేది. వారు రాజకీయ దక్షతతో, ఎక్కువగా మాట్లాడకుండా, సునిశితంగా ఒక్క మాటలోనే అన్ని విషయాలూ తేలికగా చెప్పేవారు. లేబరు లీడరుగా, విజయవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని నడిపించడం-వారు చాలా సమర్థతతో చేశారు ఏ రికమండే షనైనా చేయమని ఎవరైనా అడిగితే వారు మంచిదని నమ్మకం కలిగితేనే చేసేవారు కానీ లేకపోతే ఎవ్వరికీ చెప్పడం వుండేది కాదు. వారి కుటుంబంలో—భార్యా భర్త లిద్దరూకూడా దేశంకోసం త్యాగం చేశారు. ఇప్పుడు అటువంటివారు అరుదుగా వున్నారు. అటువంటివారి మరణం మా జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి కూడాతీరనిలోటు, వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలుగజేయుగాక యని ప్రార్థిస్తూ నేను విరమిస్తున్నాను.

శ్రీ జి. బి. అప్పారావు:—అధ్యక్షా, కీర్తిశేషులైన శ్రీమరుపిళ్ళ చిట్టిగారు మరుపు రాని మెరుపు తీగె, సర్వశక్తిసంపన్నులు, స్వతంత్ర యోధులు, హింసాతత్వంనుంచి అహింసావాదిగా మారిన ప్రముఖ రాజకీయవేత్త. ఆయన సుమారు 50 సంవత్సరాలుగా దేశసేవలో నిమగ్నులై అచంచలమైన సేవచేసినవారు. ఆయన పెద్ద విద్యావేత్త కాక పోయినా విజ్ఞానధనుడు. నాకు ఆయనతోవున్న పరిచయాన్ని పురస్కరించుకొని ఒక విషయం స్ఫురణకు వస్తుంది. బెజవాడ పట్టణంలో 30-40 సంవత్సరాల క్రిందట మాకు ఆశ్రయం ఇచ్చిన కల్పతరువు ఆయన. శ్రీ చిట్టిగారు ఆయన సహధర్మపత్నితో సహా అనేక ఉద్యమాలలో దేశకల్యాణంకోసం త్యాగం చేసినవారు. ముఖ్యమంత్రిగారు కూడా చాలా విషయాలు సుదీర్ఘంగా సవివరంగా మనవిచేశారు. ఇంత చరిత్ర వున్న మరుపిళ్ళ చిట్టిగారు మంత్రి కాలేకపోయారనే బాధ కొంతమందికి వుండవచ్చును. కాని

ఆయన మంత్రిగా సృష్టించుకున్న చరిత్రకంటె అద్వితీయమైన చరిత్ర త్యాగంలో సృష్టించుకున్నారు. అందుచేత చిట్టిగారి జన్మ సఫలమైనదనే చెప్పుకుంటే ఎంతమాత్రం ఆశ్చర్యం కాని అతిశయోక్తికాని లేదు. మనకు గులకరాళ్ళు ఎన్ని ఐనా దొరకవచ్చును కాని రత్నం దొరకడం కష్టం. శ్రీ చిట్టిగారివంటి మహాయోధుడు త్యాగశీలుడు, విజ్ఞానధనుడు దేశానికీ, కాంగ్రెసు పార్టీకి దొరకడం దుర్లభం. ఇటువంటి యోధుడు మహారత్నం ఈ నాడు లేని లోపం దేశానికి కాంగ్రెసు పార్టీకి తీరని తరగని లోటు అనడంలో ఆశ్చర్యం లేదు. ఆయన చూపిన బాటను ఆదర్శప్రాయంగా తీసుకుని ఆయన ఏరకంగా సర్దారు బిరుదును సార్థకం చేసుకున్నారో ఆ విధంగానే మిగిలిన ప్రజానీకానికి ఆదర్శమైన వెలుగు బాటను వదలిపెట్టారు. సర్దారు చిట్టిగారి చరిత్ర మరపురాని మెరుపు తీగె అని మనవి చేయడంలో ఎంతమాత్రం ఆశ్చర్యం లేదు. సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానంతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తూ చిట్టిగారి కుటుంబానికి హృదయపూర్వకమైన సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి. వి. కె రావు:— అధ్యక్షా, నాలుగుసంవత్సరాలుగా మనతో సహచరుడుగా ఉంటూ వచ్చిన శాసనసభ్యుడు సర్దారు చిట్టిగారి మరణానికి మనమందరం విచారాన్ని ప్రకటిస్తున్నాము. ఈ సందర్భంలో ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుభూతి తీర్మానాన్ని నేను కూడా బలపరుస్తున్నాను. పూర్వపు స్వతంత్ర పోరాటానికి చెందిన యోధులు సర్దారు చిట్టిగారు. రాజకీయాలలో చాలా గందరగోళాలకు ఉధృతానికి పేరుపొందిన విజయవాడ పట్టణంలో రాజకీయనాయకుడుగా ప్రఖ్యాతి చెందినవారు చిట్టిగారు విజయవాడ అంటె కాశేశ్వరరావుగారు సర్దారు చిట్టిగారి పేర్లు సహజంగా జ్ఞాపకానికి వస్తాయి. ఆయన నిజమైన గాంధీజీ శిష్యుడని చెప్పవలసి ఉంటుంది. నిరాడంబర జీవి, గర్వంలేని వ్యక్తి. ఇక్కడ నేను చూచినవారిలో అతి సున్నితమైన హృదయం కలిగి నిరాడంబరమైన పద్ధతిలో నిష్కపటంగా వ్యవహరించే వారిలో ఆయన ఒక్కరని చెప్పవలసి వుంటుంది. ఆయన మరణం చాలా లోటు కలిగిస్తుంది. ఈ శాసనసభ పూర్తిఅయే రోజులు, బహూశా ఇదే ఆఖరి సమావేశం ఏమో. ఇటువంటి సమయంలో శాసనసభ పరిమితి పూర్తి ఆయే ముందు పూర్వకాలపు రాజకీయ నాయకులలో ఒక్కరగు సర్దారు చిట్టిగారు ఆకస్మికంగా మరణించడం, మనం సంతాపాన్ని పొందడం సహజమైన విషయం. రాజకీయ గందరగోళాలకు కేంద్రమగు విజయవాడ, కృష్ణాజిల్లానుంచి వచ్చి హైదరాబాదు రాజకీయ వాతావరణంలో పడినారు. పదవినే నిజంగా కోరుకుంటే ఆయన మంత్రిపదవిని సంపాదించుకునే వాడు. దురదృష్టవశాత్తో అదృష్టవశాత్తో అటువంటి ప్రలోభంలో పడకుండా నిష్కపటంగా నిష్కామంగా దేశసేవచేసి నిష్క్రమించారు. అందరితోపాటు నా సంతోపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నాను,

శ్రీ టి. నాగేశ్వరరావు:— అధ్యక్షా, శ్రీ మరుపిళ్ళ చిట్టిగారు చరిత్రశేషులైనారు, దాదాపు 25 సంవత్సరాలుగా వారితో నాకు సన్నిహిత సంబంధం వుంది. కృష్ణకు అద్దరిని

నేనుండడం, ఆయన బెజవాడ తీరప్రాంతంలో ఉండడంవల్ల ఆయనతో సన్నిహిత సంబంధం వుండేది. వెనుకబడిన తరగతుల ఉద్యమం అంటే ఆయనకు సానుభూతి వుండేది. ఆయన ధృఢమైన సంకల్పం కలిగిన వ్యక్తి. వారి సేవలు జాతీయ, కార్మిక రంగంలోనే కాకుండా బలహీనవర్గాల సముద్ధరణలో వారి ప్రయత్నం చాలా వుందని చెప్పవలసి వుంది. ఆయన పేరున బెజవాడలో చిట్టినగర్ వంటివి వున్నాయి. బెజవాడలో ప్రతి పౌరుడు చిట్టిగారంటే ఆప్యాయతతో వుంటారు. వారి సేవలు ఎనలేనివి. వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిసూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ. భాస్కరరావు:—అధ్యక్షా. మాకు ఒక సింహం రాలిపోయిందని చెప్ప డానికి సాహసిస్తున్నాను. ఆయన మొక్కవోవని ధైర్యశాలి. సామాన్య సమయాలలో కంటె ఉధృతమైన సందర్భములతో ఆయన శక్తి కనిపించేది. చాలా ధైర్యంగా విజయ వాడ పట్టణాన్ని నడిపిన ధీరశాలి. నిజమైన గాంధేయవాది. రాష్ట్రంలో ఎక్కడా జరగని రీతిగా గాంధీ జయంత్యుత్సవాలు 8 రోజులు ఆయన నడుపుతారు పెద్దలందరిని ఆహ్వా నించి గాంధీజీ సందేశాలను వాడవాడలా ప్రచారం చేయించేవారు. గాంధీజీ సిద్ధాంతాలను ముఖ్యంగా అహింసను ఆయన జీవితంలో మలచుకుని దాని ప్రకారం నడిచిన యోధుడు ఆయన. గౌరవ సభ్యులు అనేకమంది చెప్పనట్లు వారు కార్మిక రంగంలో మంచి స్థాయిని ఏర్పాటు చేసుకున్నారు. నిజానికి కృష్ణా జిల్లా రాజకీయాలలో ఆయన ఒక ప్రముఖమైన నాయకుడు. ఎంతోమంది యువకులు ఆయన నాయకత్వాన ఎన్నో విషయాలు నేర్చు కున్నారు. ఏ ఉద్యమంలోనైనా ఆయన వెనుదీయని మనిషి. వారితో పాటు వారి కుటుం బాన్ని దేశ సేవలో నిమగ్నంచేసి త్యాగం చేసిన మహావ్యక్తి. అలాంటి వ్యక్తి ఆకస్మిక మరణం—74 ఏళ్లు వచ్చినప్పటికీ ఆకస్మిక మరణమనే అనాలి—లోను కావడం తీరని లోటు. ఏమయినప్పటికీ వారి జీవితంలో ఏ ఆశయాల కోసం జీవితాన్ని అర్పించినారో ఆయనపై గౌరవం గలిగిన వారందరు అదే విధముగా నిరాడంబరంగా జీవించి త్యాగాన్ని కనపరిస్తూ జాతీయ జీవితంలో వారు చూపినమార్గాలను మరింత మెరుగుపరచడం ఒక్కటే వారి పట్ల గౌరవం చూపించడం అవుతుంది. వారి ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చా లని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ ఈ తీర్మానాన్ని బలపరు స్తున్నాను.

శ్రీ వై. సుబ్రహ్మణ్యం:—అధ్యక్షా. ముఖ్యమంత్రిగారు సానుభూతి తీర్మానాన్ని ప్రవేశపెట్టడం ప్రజా ప్రతినిధుల సభను వాయిదా వేయమనడం చాలా సముచితమైన విషయం అని నా నమ్మకం. ముఖ్యంగా సర్దార్ చిట్టి డెత్ అనేది ఆకస్మికంగాను మేము చూశాము. ఏదీ సూస్తీగా వున్నతంగతి తెలియదు. మేము సమకాలీకులం. ఆయన వయస్సు 74 సంవత్సరాలు, నాకు కూడా 73 సంవత్సరాల వయస్సే. కాలగర్భంలో ప్రకాశం

పంతులు గారు, పట్టాభిగారు, అయ్యదేవర కాళేశ్వరరావు గారు, కాశీనాధుని నాగేశ్వరరావు గారు, సాంబమూర్తిగారు మొదలైన నటువంటివారు లీనం అయిపోయినారు ఆకోవకు చెందినవారు ప్రకాశంగారివలెనే సర్దార్ చిట్టిగారు సాహసంతో, ధైర్యంతో, నిష్ఠతో, శ్రద్ధతో, ఎన్నో కార్యాలలో ముందుకు వచ్చి ఆంధ్ర ప్రదేశానికి నడిబొడ్డు అయిన విజయవాడలో వీరుడులాగ స్వతంత్ర సమర యోధుడుగా వుండి. తననే కాక కుటుంబం యావత్తు భ్రమరాంబగారితో సహా తమ్మునితో సహా వారందరూ కూడా పోరాడారు. వారి అండదండలు లేకుండా విజయవాడలో ఏ కాంగ్రెసు మహాసభగాని సమావేశాలుగాని జరిగేవి కావు. శాంతి భద్రతలను కాపాడాలంటే వారు తమ సోదర బృదంతో మిత్ర బృదంతో రావలసినదే. నాయకులందరి మన్ననలకు పాత్రుడైనాడు. ఆయన మరణించడం కూడా వీరోచితంగానే వుంది. డూ ఆర్ డై అన్నట్లు కర్తవ్యపరాయణత్వంలో శాసనసభ సభ్యులుగా ఉంటూ మరణించడం జరిగింది. మరణించడం ఒక వరం లాంటిది. అటువంటి అవకాశం అందరికీ లభించదు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ ఆర్. మహానంద :—అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. వారితో నాకు దాదాపు 1939వ సంవత్సరానికి ముందునుండి సంబంధం వుంది. ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘం జమీందారీ ప్రాంతంలో యుండే యిబ్బందులను విచారించడానికి కమిటీ వేయబడినది. ఆ కమిటీలో జమీన్ రైతుకి సంబంధించిన శ్రీ నెల్లూరు వెంకట్రామానాయుడుగారు నేనుకూడా వుండి, మునగాల, చల్లపల్లి జమీందారీ రైతుల యిబ్బందులను విచారించడానికి ఛోగట్టా తయారు చేయడంకోసం వెళదామనుకున్నప్పుడు అక్కడికి పోవడానికి ప్రయత్నం చేస్తే ఆ ప్రాంతాలనుండి తిరిగి రారు, అందువల్ల చిట్టిగారి సహకారం తీసుకుంటే సవ్యంగా తిరిగి వస్తారని మా మిత్రులు సలహా యిచ్చినందువల్ల మేము వారిని అర్థించగా వారు ఆ ప్రాంతాలను క్షేమంగా పర్యటించడానికి రక్షణ ఏర్పాట్లు చేశారు. ఆ విధముగా జమీందారీ రైతుల యిబ్బందులను గురించి వివరాలు సేకరించడానికి అవకాశం కలిగింది. ఆయన స్వతంత్ర యోధుడు కావడమే కాకుండా కార్మికులకు ముఖ్యమైన మిత్రుడు, శ్రేయోభిలాషి. వారి మిత్రులతో సంపూర్ణమైన సహకారం యిచ్చి రైతులను ఆదుకునేవారు. అటువంటివారు లేకపోవడం చింతిస్తున్నాను. శాసనసభలో చూస్తున్నప్పుడు వెడల్పయిన కుంకుమ బొట్టుతో కళకళలాడే ముఖంతో నిత్య చిరునవ్వుతో ఉండేవారు. క్వార్టర్సునుండి అసెంబ్లీకి బస్సులో ఎక్కేటప్పుడు మొట్టమొదట ఆయనే ఎక్కేవారు. అంతటి వయస్సులోనూ అంతటి పంక్చువల్‌గా ఉండేవారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నాను.

శ్రీ జి. లచ్చన్న:—అధ్యక్షా, మన ఆంధ్రప్రాంత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సర్దార్ చిట్టిగారి జీవితచరిత్ర అవినాభావ సంబంధం కలిగిందనే సంగతి తోటి గౌరవసభ్యులందరూ శలవిచ్చి వున్నారు. ఆయన ఒక వీరోచితమైన వ్యక్తి. మన పూర్వతరంలో నిష్కల్మషంగా నిస్వార్థమైన ప్రజాసేవ చేస్తు జీవితాన్ని సాగించినటువంటి కొద్దిమంది వ్యక్తులలో వారు ఒకరు అనే సంగతి ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు. స్వర్గీయ కాళేశ్వరరావుగారు, చిట్టిగారు విజయవాడ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో స్మరణీయులు. విజయవాడ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో మరుపిళ్ళ చిట్టి, కాట్రగడ్డవారి కుటుంబములు స్వాతంత్ర్య పోరాట చరిత్రలో విలీనమైన చరిత్ర అనే ప్రత్యేకంగా చెప్పవలసినపని లేదు. మొత్తం కుటుంబం యావత్తు దేశ స్వాతంత్ర్యానికి ఏ విధమైనఅరమరికలు లేకుండా సర్వం త్యాగం చేయాలనే స్థిర సంకల్పంతో కృషి చేసిన విషయం చరిత్రలో భాగం అయింది. అదే విధముగా వారి సతీమణికూడ త్యాగం చేశారు. వారి సతీమణిగారు జైలులో వుండగా బిడ్డను కనిన విషయం తమకు తెలిసే వుంటుంది. వారు 1922—23 సంవత్సరాలలో బెజవాడలో ఆలిండియా కాంగ్రెసు కమిటీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంలో వాలంటీరుగా ఆయన రాజకీయ జీవితం ప్రారంభించిన వ్యక్తి చాలా వుదాత్తమైన వ్యక్తి. స్వతంత్ర పోరాటంలో మహా నాయకులు ఏ కార్యక్రమం తలపెట్టాలన్నా చిట్టిగారిని పిలిచి సంప్రదించాలనే వారు. ఆనాడు స్వర్గీయ ప్రకాశం గారయితేనేం పట్టాభి సీతారామయ్యగారయితేనేం కాశేశ్వరరావుగా రయితేనేం ఏ కార్యక్రమాలు తల పెట్టాలన్నా చిట్టిగారికి కబురు పెట్టించి మాట చెప్పకుండా ఏ కార్యక్రమమూ తలపెట్టలేదని చెబితే అతిశయోక్తి కాదు. అటువంటి వ్యక్తి ఈనాడు మన రాజకీయ రంగంలో లేకపోవడం అస్తమించడం తీరని లోటు. వారికి ఎటువంటి పదవీ వ్యామోహమూ లేదు. వారు నిష్కల్మషంగా సేవ చేసి ఆదర్శాలకు నిలబడినవారంటే అతిశయోక్తి కాదు. వారి పవిత్రాత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తు వారి కుటుంబానికి సభానాయకులు సానుభూతి ప్రకటిస్తూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని నేను హృదయ. పూర్వకంగా బలపరుస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. మునిస్వామి:—అధ్యక్షా, కీ.శే. మరుపిళ్ళ చిట్టిగారితో నాకు 4 సం.ల క్రితము పరిచయము కలిగినది. మేము ఓల్డు యమ్. యల్. ఏ క్వార్టర్స్‌నుంచి అసెంబ్లీకి వచ్చేటపుడుగాని, తిరిగి అక్కడకు వెళ్ళేటపుడు గాని వారివగ్గరకు వెళ్ళి కూర్చొంటే అనేక రకాలైన వారి అనుభవాలను చెబుతూ సంతోషము కలుగచేసేవారు. విజయవాడలోని హరిజనులు, రైల్వే ఎంప్లాయీస్‌వారి కృషిని, సేవలను పొగడుతూ వుంటారు. సభానాయకులు, ప్రతిపక్షనాయకులు, యితర నాయకులు అందరూ వారి త్యాగముగూర్చి చెబుతూ వుంటే వారు సరియైన రీతిగా గౌరవింపబడలేదని బాధపడుతున్నాను. వెనుకపడ్డ వర్గాల నుంచి మంత్రివర్గములో ప్రాతినిధ్యము లేదనివిచ్చించినపుడు మంత్రివర్గములో వారికి స్థానము కల్పించబడవచ్చునని వారి పేరు విన్పించినది. కాని అటువంటి అవకాశముమ

వారికి కలుగచేయకపోవడము చాల దుఃఖమును కలుగచేసినది. అంతే త్యాగము చేసిన వారి కుటుంబానికి సరియైన న్యాయము కలుగలేదని అనుకోవలసి వుంటుంది. వారి మరణము తీరని లోటు అని అందరూ గట్టిగా చెబుతున్నారు దానికి కృతజ్ఞతగా వుండడానికి ఎన్నికలేకుండా వారి కుటుంబములోని ఒకరికి సభ్యత్వము కల్పించడము న్యాయమని అటువంటిది ఏర్పాటుచేసి సభ సంప్రదాయములో నవీన చాప్టర్‌ని ఓపెన్‌చేసి మార్గదర్శకులుగా వుండే పరిస్థితిని తీసుకురావాలని చిట్టిగారి ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగచేయాలని ప్రార్థిస్తూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీ యమ్. వి. యస్. సుబ్బరాజు:—అధ్యక్షా, జన్మతోపాటు మరణము సహజము కావచ్చును. కాని అది చాల దుఃఖకరము. సర్దార్ మరుపిళ్ళ చిట్టిగారి మరణము చాల విచారమును కలుగచేసినది. నా వయస్సుకంటె ఎక్కువ కాలమును వారు తమ రాజకీయ జీవితములో గడిపారు. మహా పురుషుడు. యోగ్యుడుగా స్వాతంత్రోద్యమములో ప్రధాన పాత్రను నిర్వహించిన వ్యక్తి. గత 4 దశాబ్దాల ఆంధ్ర కాంగ్రెసు చరిత్రను పరీక్షించినపుడు చిట్టిగారి రాజకీయ జీవితానికి రాష్ట్ర రాజకీయ చరిత్రకు తేడా లేదని అన్పిస్తుంది. చాల ఆప్యాయతతో నాబోటి యువకులను దగ్గరకు తీసుకొనిన మహనీయుడు. గత 20 సం॥లుగా వారితో సన్నిహిత పరిచయము వుంది ప్రజా నాయకుడుగా, ప్రజల మన్నలను పొంది ఆంధ్ర కాంగ్రెసు చరిత్రలో ప్రముఖ పాత్రను వహించిన వారిలో చిట్టిగారు ఒకరు అని నమ్మేవారిలో నేను ఒకణ్ని. అటువంటివారి మరణము తీరని ఆశాభంగమును, విచారమును కలుగచేసినది. వారి ఆత్మకు శాంతిని కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీ జి. సూర్యనారాయణ:—అధ్యక్షా, కీ॥శే॥ మరుపిళ్ళ చిట్టిగారితో నాకు 1948లో పరిచయము కలిగినది నేను 1948 లో విజయవాడ పట్టణములో లేబరును ఆర్గనైజు చేయడానికి సోషలిస్టు పార్టీలో మెంబరుగా వెళ్ళినప్పుడు అటువంటి అవకాశము కలుగకుండా లేబరులోను, రైతాంగములోను చిట్టిగారు కన్పిస్తూ వుండేవారు. నాకు ఎట్లాంటి అవకాశము చిక్కలేదు. నేను గాంధీనగరములోని రామదాసు పేటలో హరిజనులను వుద్దేశించి వారు, నేను ఒక ప్లాటుఫారమ్‌నుంచి మాట్లాడడము తటస్థించినది. ఒకరిని ఒకరము విమర్శచేసుకొనకుండా మాట్లాడుతూ వుంటే నువ్వు మంచి వర్కరుగా నాయకత్వము వహిస్తావు అని అన్నారు. వారి ఆశీర్వాదము వల్లనే నేను గత 4 పర్యాయాలుగా శాసన సభ్యునిగా వుండే అవకాశము కలిగినది. అటువంటి మహానాయకుని, ప్రజా నాయకుని కోల్పోవడము ఎంతో దుఃఖమును కలుగచేస్తున్నది. వారు యింకా కొంతకాలము బ్రతికి రాజకీయాలలో వుంటే వారి అభిప్రాయాల ప్రకారము ముందుకు పోవడానికి అవకాశము వుంటుందని ఆశించాము. కాని వారు చనిపోయారనే వార్త ఎంతో విచారమును కలుగ చేసినది. వారి మరణము పూడ్చుకోలేని లోటు. విజయవాడలోని పీడిత ప్రజానీకము ఎంత దుఃఖములో మునిగివుంటారో చెప్పలేము. పుట్టిన ప్రతి జీవికి మరణము తప్పదు.

వారి ఆశయాలు, ఆదర్శాలు చిరస్మరణీయముగా వుండడానికి గౌరవనీయులైన ముఖ్య మంత్రిగారు ఏమైనా సూచిస్తారని ఆశిస్తున్నాను. చిట్టిగారి ఆత్మకు శాంతిని కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలుపుతూ సభానాయకులు తెచ్చిన సానుభూతి తీర్మానముతో ఏకీభవిస్తు విరమిస్తున్నాను.

Sri G. Sivaiah:— Mr. Deputy Speaker, Sir, let me associate with the feelings expressed by various members of this House on the demise of our ex-colleague Mr. Marupilla Chitti. I heard much about him though I met him only in 1967. I was very anxious to see the gentleman in 1967 when we met here for the first time. He has given me an impression that a person of desperate character in the early days has changed and become a patriot and I was impelled to see him because of my curiosity. I think he has given an impression to the public in his place and also among others that a person who may be of any character including a desperate character could convert himself into a patriot and that there is a possibility of such character persons to convert themselves into patriots. That is the impression he has given me. I associate myself again with the feelings expressed by the various members of this House and join them to pass this Condolence Resolution on the demise of this gentleman.

శ్రీ ప్రగడ కోటయ్య:—అధ్యక్షా, నేను చిట్టిగారి పేరు చాలకాలముగా వింటున్నా 1955 నుంచి నాకు వారితో సన్నిహిత సంబంధం ఏర్పడినది. వారు కూడ ఇక్కడ సభ్యులు కావడము. ఆ తరువాత ఈ 4 సం॥లుగా వారు మనతో కలిసి వుండడము జరిగింది. వారిని చూసినప్పుడు ఒక సద్గురువు దగ్గర ఒక చిన్న శిష్యుడు కూర్చున్నట్లు మాకు అనిపిస్తు వుండేది. ఆయనలో వున్న నిష్కల్మత్వము, శాంత స్వభావము, నిస్వార్థ జీవితాన్ని గడుపగలిగిన మహత్తరమైన శక్తి ఎంతో ఎన్నదగినవి. అవకాశము వచ్చినప్పుడు చాలామంది తమ జీవితాలను నిస్వార్థముగా గడపలేరు. అన్ని అవకాశాలు కలిగి, అందరి పరిచయాలు కలిగి మహోన్నతమైన సంపదను సమకూర్చు కొనగలిగిన అవకాశమువున్నా ఒక మహా పురుషునిగా, నిస్వార్థ జీవితమును గడపగలగడము మహోన్నతమైన గుణము. అటువంటి మహోన్నతమైన గుణము కలవారు వారు. వారి త్యాగమయ జీవితములో కార్మిక ఉద్యమములలో గాని, కాంగ్రెసు ఉద్యమములో గాని సర్వత్రా ముందు వుంటూ మన మిత్రులు చెప్పినట్లుగా విజయవాడే ఆయన, ఆయనే విజయవాడ అనే పేరు ప్రతిష్ట లను ఆంధ్ర దేశమంతా వ్యాపింప చేయగలిగిన ధీరోధాత్తుడు, వారి మరణము అకాలము కాకపోవచ్చును. మరి కొంతకాలము మనతో వుండడమును అదృష్టముగా భావించేవారము. అటువంటివారు మనమంచి పోవడము విజయవాడ పౌరులకేకాకుండా ఆంధ్ర దేశములోవున్న పీడిత ప్రజానీకానికి తీరనిలోటు. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన

తీర్మానముతో ఏకీభవిస్తూ, భగవంతుడు వారి ఆత్మకు శాంతిని కలుగచేయాలని ప్రార్థిస్తూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీ బి. నిరంజనరావు:—అధ్యక్షా, ఈ రోజు చాల దురదృష్టకరమైన రోజు. కృష్ణాజిల్లాలోని 2 కాంగ్రెసు కమిటీలను కలపాలనే ప్రయత్నములో అక్కడున్న పరిస్థితులలో నాకు 1957 లో చిట్టిగారితో పరిచయము ఏర్పడినది. ముఖ్యంగా విజయవాడ పట్టణం కాంగ్రెసు కమ్యూనిస్టుపార్టీలు కేంద్రీకరించి వున్న పట్టణం. అటువంటి చోట వారు కాంగ్రెసుపార్టీని ఆర్గనైజ్ చేస్తూ ఎంతనేర్పుగా, ఎంత క్రమశిక్షణతో పైకి తీసుకురాగల్గారో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. విజయవాడ ముఖ్యంగా రైల్వేజంక్షన్ కావడంవల్ల వచ్చిపోయేవారు ఎంతోమంది వుంటారు. వారిని గౌరవించటానికి వీరి అధ్వర్యం క్రింద ఆ పట్టణంలో కాంగ్రెసుపార్టి ఎంతగానో పని చేసింది. 54 సంవత్సరాల క్రిందట విజయవాడ పట్టణంలో వారు, వారి సోదరులు స్వతంత్రపోరాట సమయంలో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాన్ని లేవదీశారు, ఆ పట్టణంలో ఇండ్లు పడిపోయినప్పుడు పేదలకు ఇండ్లవసతి కల్పించడంలో చిట్టిగారు ప్రధాన పాత్ర వహించి ప్రజల కష్టాలను ఇటు ప్రభుత్వానికి, అటు స్థానికసంస్థలకు చెప్పి తద్వారా వారి కష్టాలను తొలగించటానికి ఎంతో కృషి చేశారు. 50 సంవత్సరాలుగా వారు ఆంధ్ర రాష్ట్రానికి, కృష్ణాజిల్లాకు, విజయవాడ పట్టణానికి చేసిన కృషి ఎవరూ మరచిపోలేరు. వారి మరణం తీరనిలోటు. వారి కుటుంబానికి పూర్తి సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

Mr. Deputy Speaker:—I rise to associate myself to support the Condolence Motion moved by the Leader of the House. We have heard about Mr. Chitti, one who has left all the people and who has loved all the people. We have lost a person who always served the humanity. It is an irreparable loss for ourselves, for the Nation and for Vijayawada Town in particular. I pray Almighty to give peace to the departed soul and strength to the bereaved family. I request all of you to stand in silence for two minutes as a mark of respect for the departed soul.

The question is: "This House places on record its deep sense of sorrow at the demise of Sri Marupilla Chitti, a Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the Members of the bereaved family"

The Motion was adopted Nem Con. all Members standing in silence for two minutes.

Mr. Deputy Speaker:—Starred questions posted for to-day will be taken up on the 7th August 1971.

(The House then adjourned till Half-past Eight of the Clock on the 20th day of July 1971.)